సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 31 । మార్చి । 2023



ఆటో దొంగల అరెస్ట్

ఆటోలను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. - 8లో



మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. - 10లో

గరిష్టం/కనిష్టం 36°/23°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-48 (శనివారం ఉదయం)

న్యూస్‌రీల్

నేడు యాదాద్రి ఆలయ హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలు, నగదును శుక్రవారం లెక్కించనున్నారు. ఈ మేరకు ఈఓ గీతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ కింద వ్రత మండప భవనంలో లెక్కింపు ఉంటుందన్నారు.

పరిహారం చెల్లించే వరకు నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న లప్పానాయక్ తండావాసులు

యాదగిరిగుట్ట రూరల్ : పరిహారం, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బస్వాపురం రిజర్వాయర్ ముంపు గ్రామం లప్పానాయక్ తండావాసులు చేపట్టిన దీక్ష గురువారం 15 రోజు కొనసాగాయి. పరిహారం కోసం మూడేళ్లుగా ఎదురుచూస్తున్నామన్నామని, దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాప్యం చేయకుండా దాతరుపల్లిలో పునరావాసం కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న భూమికి పరిహారం చెల్లించాలని కోరారు. అప్పటి వరకు దీక్ష విరమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీరావత్ బుజ్జి శంకర్, ఉపసర్పంచ్ మంక్యానాయక్, బిచ్యానాయక్, రవికాంత్, సురేష్, భరత్, తండావాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : మండలంలోని లోతుకుంట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సర్పంచ్ రాచకొండ బచ్చయ్య ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, నాయకులు గారిసె రవి, పల్లెర్ల రాజు పల్లెర్ల సుధాకర్, కొత్త శ్రీనివాస్, సంకబుడ్డి శ్రీనివాస్, పాక నర్సింహ, వెంకటేష్, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచ నారసింహుడికి విశేష పూజలు



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారికి గురువారం నిత్య కైంకర్యాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన, నిజాభిషేకాలు నిర్వహించి తులసీ దళాలు అర్చించారు. అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఇక ఆలయ ప్రాకార మండపాల్లో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి జోడుసేవ, సహస్రనామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయ ద్వార బంధం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా వివిధ విభాగాల ద్వారా స్వామి వారి ఖజానాకు రూ.16,67,945 ఆదాయం చేకూరిందని దేవస్థానం అధికారులు వెల్లడించారు.

• కమనీయం.. రాములోరి కల్యాణం



శ్రీరామనవమి సందర్భంగా గురువారం యాదాద్రి కొండపై ఉన్న శివాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



భువనగిరి పట్టణంలోని గోవింద క్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

అనర్హులుంటే తొలగిస్తాం

- కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి : అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించారన్న ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వారుంటే విచారణ జరిపి తొలగిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన ఇళ్ల పంపిణీపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో గురువారం ఒక ప్రకటనలో ఆమె స్పందించారు. సింగన్నగూడెం వద్ద మొత్తం 444 ఇళ్లు నిర్మించగా 4,315 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇళ్ల పంపిణీ పారదర్శకంగా జరిగేలా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెండు దఫాలు క్షేత్రస్థాయిలో విచారణ చేయించినట్లు వెల్లడించారు. 1,950 మందిని అర్హులుగా గుర్తించి వార్డు సభల్లో ప్రదర్శించినట్లు వివరించారు. ఆర్డీఓ పర్యవేక్షణలో మున్సిపల్ కౌన్సిలర్లు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం డ్రా తీసి 417 మందికి ఇళ్లను కేటాయించినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పీహెచ్‌సీ కేటగిరీల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. లబ్ధిదారుల్లో అర్హతలు లేనివారు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. విచారణ జరిపి అనర్హులని తేలితే వారిని తొలగిస్తామన్నారు.

కళ్లజోళ్లకు కటకట!

- దూరపు చూపు అద్దాలకు జాప్యం
- 12,254 మందికి పెండింగ్
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- పీహెచ్‌సీలు, కంటి వెలుగు శిబిరాల చుట్టూ ప్రదక్షిణలు



మోత్కూరుకు చెందిన పరిమళ అంబ మోత్కూరులోని గీత సొసైటీ భవనంలో ఏర్పాటు చేసిన శిబిరంలో కంటి పరీక్ష చేయించుకోవడానికి వెళ్లింది. వైద్యసిబ్బంది ఆమెకు పరీక్ష చేసి చుక్కల మందుతో పాటు మూడు రోజులకు టాబ్లెట్‌లు ఇచ్చారు. కాగా కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌లో ని ప్రైవేట్ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకున్నట్లు వైద్య సిబ్బందికి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో వారు అక్కడికే వెళ్లి అద్దాలు తెచ్చుకో అని ఉచిత సలహా ఇచ్చి పంపించినట్లు బాధితురాలు వాపోయింది.

సాక్షి, యాదాద్రి : కలెక్టరేట్‌లో ఉద్యోగుల కోసం, జర్నలిస్టులకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించేందుకు జనవరి 24, 25 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి రీడింగ్ గ్లాసులు ఇచ్చారు. దూరపు చూపు సమస్య ఉన్న వారికి మాత్రం ఇవ్వలేదు. గ్రామాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి'..జిల్లాలో రెండో విడత కంటి వెలుగు పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాల పంపిణీ నత్తనడకన సాగుతోంది. రీడింగ్ గ్లాసులు ఎప్పటికప్పుడు అందుతుండగా.. దూరపు చూపు సమస్య ఉన్న వారికి జాప్యం జరుగుతోంది. 15 రోజుల్లో ఇస్తామని వైద్యులు రశీదు ఇస్తున్నారు. కానీ, రెండు నెలలు గడిచినా అందడంలేదు. దీంతో బాధితులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కంటి వెలుగు శిబిరాల చుట్టూ తిరిగిపోతున్నారు.

పరీక్షలు, అద్దాల పంపిణీ ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో జనవరి 19న ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 6.07 లక్షల మందిని అర్హులుగా గుర్తించగా ఇప్పటి వరకు 1,81,701 మంది పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 1,27,492 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని వైద్యులు తేల్చారు. 30,245 మందికి దగ్గరి చూపు సమస్య ఉండగా దాదాపు అందరికీ రీడింగ్ గ్లాసులు అందజేశారు. ఇక 23,964 మందికి దూరపు చూపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 11,710 మందికి మాత్రమే అద్దాలు పంపిణీ చేశారు. ఇంకా 12,254 మందికి అందలేదు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

అర్హులు	6,07,062
పరీక్షలు పూర్తి	1,81,701
పురుషులు	85,237
మహిళలు	96,388
ఇతరులు	40
ప్రిస్కిప్షన్ అద్దాలకు ఎంపిక	23,964
అందిన వారు	11,710
పెండింగ్	12,254

ఏజెన్సీల నుంచి జాప్యం : దూరపు సమస్య ఉన్న వారికి 15 రోజుల్లో అద్దాలు తెప్పించి ఆశ కార్యకర్తలతో ఇంటికి పంపిస్తామని ప్రకటించారు వైద్యాధికారులు ప్రకటించారు. కానీ, జిల్లాలో రెండు నెలలు గడిచినా అందలేదు. కళ్లద్దాలు సరఫరా చేసే బాధ్యతను రెండు ఏజెన్సీలకు అప్పగించారు. ఒక ఏజెన్సీ నుంచి బాగానే సరఫరా జరుగుతున్నా మరో ఏజెన్సీ నుంచి తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

పరీక్షలు పూర్తయిన గ్రామాలు

జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 216 గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు పరీక్షలు పూర్తయ్యాయి. 26 గ్రామ పంచాయతీల్లో శిబిరాలు కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీల పరిధిలో 69 వార్డుల్లో పూర్తి కాగా ప్రస్తుతం 7 వార్డుల్లో నిర్వహిస్తున్నారు. మొత్తం 1,81,701 మంది పరీక్షలు చేయగా అందులో ఎస్సీలు 30,817, ఎస్టీలు 9,221, బీసీలు 1,21,152, మైనార్టీలు 2,094, ఇతరులు 18,381 మంది ఉన్నారు.

15 రోజుల్లో వస్తాయన్నరు



కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోగా నాకు దూరపు చూపు సమస్య ఉందని సిబ్బంది గుర్తించి అద్దాలు వస్తాయని రాసి ఇచ్చారు. 15 రోజుల్లో వస్తాయని రశీదు ఇచ్చారు. నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు అద్దాలు రాలేదు. గతంలో పరీక్ష చేసినప్పుడు అప్పటికప్పుడు ఇచ్చారు. ఈసారి ఆలస్యం అవుతుంది.

–రంగ అంజయ్య, ప్రగతినగర్, భువనగిరి

మొక్కుబడిగా టెస్టులు

జిల్లా వ్యాప్తంగా 421 గ్రామ పంచాయతీలు, 6 మున్సిపాలిటీల పరిధిలో 104 వార్డుల్లో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించేందుకు 525 శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రతి శిబిరం వద్ద ఒక మెడికల్ ఆఫీసర్, ఆప్టోమెట్రిస్ట్, మెడికల్ సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఆశ కార్యకర్తలు, ఇద్దరు ఏఎన్‌ఎంలను నియమించారు. వీరంతా ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరాల వద్ద అందుబాటులో ఉంటూ పరీక్షలు నిర్వహిస్తారని, మండల కేంద్రంలోనే రాత్రి బస చేస్తారని ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ, మండల కేంద్రాల్లో ఏ ఒక్కరూ బస చేయడం లేదు. ఉదయం 10 దాటితే కానీ పరీక్షలు ప్రారంభించడం లేదు. అంతేకాకుండా పరీక్షలకు వచ్చినవారిపట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అభివృద్ధి.. ఆహ్లాదం!

యాదగిరిగుట్టకు నూతన సొబగులు

- ఎకరం స్థలంలో మోడ్రన్ శ్మశానవాటిక
- వార్డుల్లో గార్డెనింగ్
- ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు
- చిన్న పిల్లలకోసం ఆటల పరికరాలు



మోడ్రన్ శ్మశానవాటిక నమూనా

యాదగిరిగుట్ట : రింగ్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీతో ఇప్పటికే ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న యాదగిరిగుట్ట మున్సిపాలిటీ మరిన్ని సొబగులను సంతరించుకోనుంది. వివిధ అభివృద్ధి పనులతో పాటు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, చిన్న పిల్లల కోసం ఆటల పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల పనులు ప్రారంభం కాగా మే నెలాఖరు నాటికి పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



2వ వార్డులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

చేపట్టిన పనులు ఇలా..

యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి. 2వ వార్డులో రూ.25 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్, గ్రీనరీ, 5వ వార్డులో రూ.25 లక్షల వ్యయంతో వాకింగ్‌ట్రాక్, చిన్న పిలలు ఆడుకునేందుకు వీలుగా ఆట సామగ్రి, 11వ వార్డులో రూ.50 లక్షలతో వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట సామగ్రి, ఓపెన్ జిమ్, ప్రజలు సేద దీరేందుకు గార్డెనింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పలు పనులు కొనసాగుతుండగా మరికొన్నింటిని ప్రారంభించాల్సి ఉంది. వీటితో పాటు అదనంగా 5వ వార్డులో ఉన్న బీసీ కాలనీలోని కమ్యూనిటీ హాల్, రూ.12 లక్షల వ్యయంతో వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

కోటి రూపాయలతో మోడ్రన్ శ్మశానవాటిక



6వ వార్డులో నిర్మిస్తున్న మోడ్రన్ శ్మశానవాటిక

అధునాతన హంగులతో మోడ్రన్ క్రిమిటోరియం (శ్మశానవాటిక) నిర్మించనున్నారు. దీన్ని 6వ వార్డులో సుమారు ఎకరం స్థలంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నారు. పనులు కూడా మొదలయ్యాయి. ఇందులో స్టోర్ రూం, మరుగుదొడ్లు, కూర్చోవడానికి హాల్, దహన వాటిక, పేర్లు నమోదు చేసుకునే కార్యాలయంతో పాటు పలు నిర్మాణాలు చేస్తున్నారు. అంతేకాకుండా గ్రీనరీ, పూల మొక్కలు రానున్నాయి. ప్రస్తుతం స్లాబ్ పూర్తికాగా గోడల పనులు కొనసాగుతున్నాయి.

ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం తర్వాత భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. చాలా మంది ఇక్కడే బస చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యాదగిరిగుట్ట పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తున్నారు.

మే నెలాఖరుకు పనులన్నీ పూర్తి



ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సహకారంతో మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. 2, 5, 11వ వార్డుల్లో ఓపెన్ జిమ్‌లు, చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట సామగ్రి, వాకింగ్ ట్రాక్‌లు, ప్రజలు సేద దీరేందుకు గ్రీనరీ, పూల మొక్కలు, 6వ వార్డులో మోడ్రన్ శ్మశానవాటిక నిర్మిస్తున్నాం. వీటితో పాటు యోగానంద నిలయం నుంచి బీసీ కాలనీ చివరి వరకు ఓపెన్ డ్రెయినేజీకి ఫినిషింగ్ పనులు చేపట్టాం. మే నెలాఖరు వరకు పనులన్నీ పూర్తి చేస్తాం.

–శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

రూ.25 లక్షలతో డ్రెయినేజీ పనులు

యోగానంద నిలయం నుంచి బీసీ కాలనీ చివరి వరకు కిలో మీటరు మేర పెద్దమోరీ (డ్రెయినేజీని)ని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులతో ఓపెన్ డ్రెయినేజీగా విస్తరించారు. సుమారు కిలో మీటరు దూరం వరకు పనులు పూర్తయ్యాయి. ఓపెన్ డ్రెయినేజీకి ఇరువైపులా గోడ ఎత్తు తక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీంతో డ్రెయినేజీకి ఇరువైపులా ఎత్తు పెంచనున్నారు. రూ.25 లక్షలతో పనులు చేపట్టనున్నారు.త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

ప్లాట్లు, భూములున్నోళ్లకే ఇచ్చారు

- ఆలేరులో డబుల్ బెడ్ రూం ఇళ్ల దరఖాస్తుదారుల ర్యాలీ

ఆలేరు రూరల్ : డబుల్ బెడ్ రూం ఇళ్ల దరఖాస్తుదారులు ఆలేరులో రోడ్డెక్కారు. నిరుపేదలను కాదని అనర్హులను ఎంపిక చేశారంటూ, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందకుండా పక్కదారి పట్టిస్తున్న తహసీల్దార్ రామకృష్ణను సస్పెండ్ చేయాలని కౌన్సిలర్ సమంతక ఆధ్వర్యంలో దరఖాస్తుదారులు గురువారం ఆలేరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రి డ్రా తీశారని, జాబితాలో పేర్లను కూడా మార్చారని ఆరోపించారు. దరఖాస్తుల విచారణ పారదర్శకంగా జరగలేదని, డబ్బులు చేతులు మారాయని, ఉన్నతాధికారులకు తెలిసినా స్పందించడం లేదన్నారు. నిజమైన పేదలకు ఇళ్లు అందలేదని, ప్లాట్లు, భూములు ఉన్నవారికే కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులను మరోసారి పారదర్శకంగా విచారణ చేసి నిరుపేదలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీ అమీనా, ఎండీ సర్వర్, అరుణ, సల్మా, పర్రె శేఖర్, జంగ లక్ష్మి, బొట్ల మంజుల, సునీత, సుశ్మిత, ఎర్రం మౌనిక, కర్రె ప్రమీళ, గుర్జుకుంట మంజుల, మదారి సోమలక్ష్మి, ఎండీ సఫియా, పద్మావతి, రామకృష్ణ, కృష్ణమూర్తి, కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దరఖాస్తుదారులు

భూదాన్ భూముల పరిరక్షణకు కృషి

- సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

భూదాన్‌పోచంపల్లి : భూదాన్ భూముల పరిరక్షణకు కృషి చేస్తామని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లిలోని వినాబాభావే మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు పేదలకు పంచిన భూదాన్ భూములు పలు చోట్ల అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూదాన్ భూముల పరిరక్షణతో పాటు అహింస, శాంతి, సామరస్యం అనే గాంధీజీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేందుకు సర్వోదయ మండలి పని చేస్తుందన్నారు. అనంతరం సర్వోదయ మండలి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శంకర్‌నాయక్, అధ్యక్షుడిగా వడ్డేపల్లి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ సాధిక్, ప్రధాన కార్యదర్శిగా పొనమోని కృష్ణ, కార్యదర్శిగా భారత భూషణ్, కోశాధికారిగా డబ్బీకార్ కాశీనాథ్, సభ్యులుగా మిర్యాల కృష్ణమూర్తి, తండ కిషన్, గుర్రు మైసయ్య, ఉడుగు బిక్షపతి, చెక్క లక్ష్మి, సుల్తానా, పెద్దల భిక్షపతి, కరగల్ల ధనమ్మ, చింతకుంట్ల బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

దేవరకొండ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యూత్ జోడో-బోత్ జోడో రాష్ట ఇన్‌చార్జి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని కట్టకొమ్ముతండా, కొండభీమనపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ యూత్ జోడో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్ : అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ హమాలీ (ఏఐటీయూసీ అనుబంధ) సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల వారీగా పనిచేస్తున్న కార్మికులందరికీ వారి అడ్డాల వద్ద షెడ్లను నిర్మించాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా రూ.10లక్షలు, 50ఏళ్లు దాటిన ప్రతి కార్మికుడికి రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి ఇంటి స్థలం, వారి పిల్లలకు విద్య, వైద్యం వంటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ముస్కు జానయ్య, చలా లక్ష్మీనారాయణ, రామిశెట్టి సుబ్బారావు, చల్లా శివ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి ఆత్మహత్యాయత్నం


సంతోష్‌నాయక్‌ను రైలు పట్టాల పైనుంచి తీసుకొస్తున్న పోలీసు

నల్లగొండ క్రైం: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో రైలు పట్టాలపై గురువారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి యత్నించగా పోలీసులు గుర్తించి కాపాడారు. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని న్యూతిరుమల నగర్‌కు చెందిన సంతోష్‌నాయక్ కుటుంబ తగాదాలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో అతడి సోదరుడు సతీష్‌నాయక్ డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు విషయం చెప్పడంతో సంతోష్‌నాయక్ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్ రోడ్డులో రైలు పట్టాలపై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకుని అతడిని పట్టాల పైనుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసు సిబ్బంది అనిల్, మహేష్, స్థానికుడు సైదులును నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

భూమి అమ్మి రెండేళ్లయినా డబ్బులు ఇవ్వట్లేదని..

- పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం
- సెల్ఫీ వీడియో చిత్రీకరణ
- ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్ తండాలో ఘటన

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): భూమి అమ్మి రెండేళ్లయినా కొన్నవారు డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని మండల పరిధిలోని కోటినాయక్‌తండాకు చెందిన యువకుడు గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగు మందు తాగుతూ ఆ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకోవడంతో అది కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వివరాలు.. మండలంలోని కోటినాయక్ తండాకు చెందిన ధరావత్ శ్రీకాంత్ చివ్వెంల మండలం గాయంవారిగూడెం శివారులోని ఖమ్మం బైపాస్ రోడ్డులో గల అతడి మామ బానోతు వెంకన్నకు చెందిన 25 గుంటల భూమిని రెండేళ్ల క్రితం అదే మండలం బీబీగూడెం గ్రామానికి


సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగుతున్న శ్రీకాంత్

చెందిన ఎస్ఆర్ నాయక్‌తో పాటు ఓ మండల స్థాయి ప్రజాప్రతినిధి, ఎంజీ నగర్ తండాకు చెందిన మరో వ్యక్తికి కలిపి రెండేళ్ల క్రితం అమ్మాడు. భూమి కొనుగోలు చేసిన వారు కొంత డబ్బులు చెల్లించి మరో రూ.40లక్షలకు చెక్కులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. చెక్కుల రూపంలో ఇచ్చిన రూ.40లక్షలను డబ్బు రూపంలో ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ శ్రీకాంత్ గురువారం సెల్ఫీ వీడియో తీస్తూ గ్రామంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం ఆ వీడియోను వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశాడు. గ్రామస్తులు వీడియోను చూసి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. తన మామ అనారోగ్యానికి గురై ఆర్థికంగా సతమతమవుతున్నాడని, తమ భూమి కొన్నవారిలో రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఉండడంతో పోలీసులు పట్టించుకోవడం లేదని శ్రీకాంత్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. పోలీసులు, అధికారులు పట్టించుకోకపోవడంతో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ వీడియోలో తెలిపాడు. కాగా శ్రీకాంత్ ప్రస్తుతం సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన టిప్పర్

మాదుగులపల్లి: రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మకల్లు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వేములపల్లి మండలంలోని కామేపల్లి గ్రామం నుంచి రాళ్ల లోడ్‌తో టిప్పర్ మాదుగులపల్లి మండలంలోని చిలుమర్తి గ్రామానికి బయల్దేరింది. ఈ క్రమంలో బొమ్మకల్లు గ్రామం వద్దకు రాగానే అదుపుతప్పి అలుగుబెల్లి సత్తెమ్మ ఇంటి ప్రహరీని ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లింది. దీంతో ఇంటి గోడ కూలి రేకులు ధ్వంసమయ్యాయి. సత్తెమ్మ మరో గదిలో ఉండడంతో ప్రమాదం నుంచి బయటపడింది. టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో


టిప్పర్ ఢీకొట్టడంతో ధ్వంసమైన ఇంటి గోడ

ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నేరేడుచర్ల : ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం నేరేడుచర్ల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. నేరేడుచర్ల పట్టణంలోని


గేయశ్రీ (ఫైల్)

జాన్‌పహాడ్ రోడ్డులో నివాసముంటున్న ఆత్కూరి సుబ్బారావుకు ఖమ్మం జిల్లాలోని మధిరకు చెందిన గేయశ్రీ(28)కి 2016లో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గేయశ్రీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదని, కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్ఐ పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

సాగర ద్వీపం.. చాకలిగట్టు

- అభివృద్ధి చేస్తే ఆహ్లాదం.. ఆదాయం
- అటవీ శాఖ రికార్డులకే పరిమితమైన ఐలాండ్ డీర్ పార్కు
- పర్యాటక కేంద్రంగా మారిస్తే సాగర్‌కు పెరగనున్న సందర్శకులు


సాగర్ జలాశయం మధ్యలో ఉన్న చాకలి గట్టు ద్వీపం

నాగార్జునసాగర్: చుట్టూ జల సవ్వడులు.. మధ్యలో పచ్చని చెట్లు.. పక్షుల కిలకిలరావాలు, చల్లటి గాలులతో ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతూ అందంగా కనిపించే ప్రకృతి వరప్రసాదమైన ద్వీపం చాకలిగట్టు. ఈ ద్వీపం సాగర్ జలాశయం మధ్యలో 400 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. నాగార్జునుడు నడయాడిన ఈ కృష్ణాతీరమంతా ఆనాడే బౌద్ధధామంగా విరాజిల్లింది. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జరిగిన తవ్వకాల్లో బయల్పడిన నాగార్జునుడు నడిపిన ఆనాటి విద్యాలయాల ఆనవాళ్లు, నాగార్జునకొండలో చెక్కుచెదరకుండా ఉండేలా ఏర్పాటు చేశారు. పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతున్న ఈ నాగార్జున కొండకు సమీపంలోనే ఈ చాకలిగట్టు ద్వీపం ఉండటం మరో విశేషం. అయినప్పటికీ ఈ గట్టు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ఐలాండ్ డీర్ పార్కుగా మార్చాలనుకున్నా..

1976లో ఆనాటి జిల్లా అటవీశాఖ అధికారిగా ఉన్న గంగాఖేద్కర్ ఈ గట్టుపై సంచరించి ఇక్కడున్న సహజ వనరులను పరిశీలించారు. జనావాసాలకు దూరంగా ఉండటంతో ఇక్కడ జింకల సంతతి వృద్ధి చెందుతుందని భావించి ఆనాడే ఎనిమిది జింకలను తెచ్చి గట్టుపై వదిలారు. ఆ సమయంలోనే మొదటి సారిగా మాంగోలిస్ అనే చీమలను తినే జంతువు ఆయన కంటపడింది. ఈ గట్టుపైన మాంగోలిస్ ఉండటం గమనించిన ఆయన దీనిని ఐలాండ్ డీర్ పార్కుగా రూపొందించి భవనాలు నిర్మిస్తే బాగుంటుందని భావించి నప్పటికీ పూర్తిస్థాయిలో అది కార్యరూపం దాల్చలేదు. ఆనాటి టూరిజం శాఖ మంత్రి దేవానందరావు సాగర్ వచ్చినప్పుడు చాకలిగట్టును చూసి భారతదేశంలోనే మొట్టమొదటి ఐలాండ్ డీర్ పార్కుగా అభివర్ణించారు. ఈ పార్కు కేవలం అటవీ శాఖ రికార్డులకే పరిమితమైంది తప్ప అభివృద్ధికి నోచుకోవడం లేదు.

గట్టులో జింకల సంఖ్యలో 20కిపైనే..

అనంతరం 2013లో బబిత డివిజనల్ అటవీ శాఖ అధికారిగా వచ్చిన తర్వాత చాకలిగట్టు అభివృద్ధికి ఎంతగానో ప్రయత్నించారు. వారి హయాంలోనే తిరుపతి నుంచి కృష్ణజింకలు, గడ్డిజింకలతో పాటు మరికొన్ని జాతుల జింకలు, దుప్పులను తెప్పించి ఈ గట్టుపైన వదిలారు. వాటి రక్షణకు వాచర్స్‌ను ఏర్పాటు చేశారు. వాటికి వేసవిలో పచ్చిగడ్డి దొరికేందుకు సోలార్ పంపులను వినియోగించి జలాశయం నుంచి నీటిని తోడి భూమిని తడిపేవారు. ప్రస్తుతం ఈ జింకల సంఖ్య 20 దాటినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇక్కడ ఒకప్పుడు ఇక్కడ జనసంచారం ఉన్నట్లుగా ఇటీవలే బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, ఈమని శివనాగిరెడ్డిలు ఈ ప్రాంతాన్ని సందర్శించిన సమయంలో గుర్తించారు. సాగర్‌డ్యాం నిర్మాణంతో జలాశయం ఏర్పాటు కావడంతో చాలావరకు చరిత్ర కనుమరుగైనట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

భవనాలు నిర్మిస్తే పెరగనున్న ఆదాయం

చాకలిగట్టు ద్వీపంపై ప్రభుత్వం భావించినట్లు భవనాలు నిర్మించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తే పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతోపాటు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థకు ఆదాయంతోపాటు స్థానికులకు ఉద్యోగవకాశాలు పెరుగుతాయని టూరిజం శాఖ అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చాకలిగట్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- మూడు విదేశీ వాచీలు, పురాతన వెండి నాణాలు అపహరణ
- దుండగులు వదిలి వెళ్లిన బైక్ స్వాధీనం

కేతేపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన కేతేపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ బందా లూబెత్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లాడు. కాగా బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బెడ్‌రూంలోకి చొరబడి బీరువాలోని వస్తువులు, డాక్యుమెంట్లను చిందరవందరగా పడేశారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన పాలేరు తాళం పగులగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి యజమాని లూబెత్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో కేతేపల్లికి చేరుకున్న లూబెత్


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్

రూ.20 వేల విలువైన మూడు విదేశీ వాచీలు, 300 గ్రాముల పురాతన వెండి నాణాలు దుండగులు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన ఇంటికి పక్కనే దుండగులు వదిలి వెళ్లిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ బైక్ సూర్యాపేట పట్టణంలోని సీతారాంపూర్‌కు చెందిన చెవుల నరేష్‌దిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

మిర్యాలగూడ: మార్కెట్ యార్డులకు రైతులు ధాన్యం తీసుకొస్తున్నందున వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. 15రోజుల నుంచి వరి ధాన్యం తెచ్చి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న దామరచర్ల మార్కెట్ యార్డులోని రైతులను గురువారం ఆయన కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు రైతులు ధాన్యం తెస్తున్నా టార్పాలిన్లు అందించడం లేదని, రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం కూడా ఉండడం లేదన్నారు. ప్రభుత్వ వెంటనే పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల నిర్వాహకుతో సంప్రదించి వరి ధాన్యాన్ని కొనుగోలు


దామరచర్ల మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

చేయాలని లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్, నాయకులు పాపానాయక్, దయానంద్, గోపి, రవి, విజయ్, శ్రీహరి, పిచ్చయ్య, బాలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు సన్మానం

కేతేపల్లి : భద్రాచలంలో జరిగిన శ్రీరామనవమి వేడుకలకు హాజరైన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ గురువారం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో మార్గమధ్యలో కేతేపల్లి వద్ద ఆగారు. ఈసందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు దత్తాత్రేయకు సాదరంగా ఆహ్వానం పలికి బొకేలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ జిల్లా నేత అయితగోని అంజయ్య గౌడ్ నివాస గృహానికి వెళ్లి నివాళులర్పించారు. అంజయ్య భార్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అనితతో పాటు, కుటుంబ సభ్యులను దత్తాత్రేయ పరామర్శించారు. అక్కడే అల్పాహారం చేసిన దత్తాత్రేయ అనంతరం హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్ దత్తాత్రేయకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

ఆటోలు చోరీ చేస్తున్న దొంగల అరెస్టు

- ఐదు ఆటోలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట క్రైం: ఆటోలను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ


నిందితులను చూపుతున్న డీఎస్పీ నాగభూషణం, సిబ్బంది

తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న పట్టణంలోని చర్చి కాంపౌడ్‌కు చెందిన అనంతుల లింగయ్య తన ఆటో పోయిందని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఆదేశాల ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ఖమ్మం నుంచి సూర్యాపేట మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో అనుమానాస్పదంగా కనిపించడంతో దానిని ఆపారు. ఆటో నడుపుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన ధరావత్ శివ, హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అలీమ్‌ను పోలీసులు విచారించగా.. ఆటోను దొంగిలించి ఖమ్మంలో విక్రయించేందుకు ప్రయత్నించగా అమ్ముడుపోకపోవడంతో హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. మహ్మద్ అలీమ్ ఓఎల్ఎక్స్ ద్వారా శివకు పరిచయమై దొంగిలించిన ఆటోలు విక్రయించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపాడు. మహ్మద్ అలీమ్ గతంలోనూ ఆటోలు దొంగతనం చేసి జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు తెలిపిన వివరాలతో రూ.10లక్షల విలువైన ఐదు ఆటోలను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. సమావేశంలో సీఐ జి. రాజశేఖర్, ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుళ్లు గొర్ల కృష్ణ, గోదేశి కరుణాకర్, సైదులుగౌడ్, మధుగౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు చేశారు.


మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్ , ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు , పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ,ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

ఏడు నెలల తర్వాత మృతదేహం లభ్యం

- గతేడాది ఆగస్టులో హత్య

దేవరకొండ(చందంపేట): గతేడాది ఆగస్టులో జరిగిన ఓ హత్యకు సంబంధించి మృతదేహం ఏడు నెలల తర్వాత లభ్యమైంది. నేరెడుగొమ్ము ఎస్ఐ బి. రాజు తెలిపిన ప్రకారం.. మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ గ్రామానికి చెందిన ధనావత్ రాగ్యకు పెద్దవూర మండలం ఊరబావి గ్రామానికి చెందిన ఓ మహిళతో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాగ్య హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే రాగ్య భార్యకు వరుసకు బావ అయిన లక్పతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తుండడంతో భర్తను అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలోనే రాగ్య భార్య నేరెడుగొమ్ము మండలం బుగ్గతండాకు చెందిన మాన్‌సింగ్, బాలోజీలతో కలిసి రాగ్య హత్యకు పథకం రచించింది. మాన్‌సింగ్, బాలోజీలు బొలేరో వాహనంలో చేపలు తరలిస్తూ జీవనం సాగిస్తుండేవారు. రాగ్య హత్యకు సుపారీ అందడంతో కొంతకాలం మాన్‌సింగ్, బాలోజీలు రాగ్యతో పరిచయం పెంచుకొని సన్నిహితంగా మెలుగుతూ వచ్చారు. ఈ క్రమంలోనే 2022 ఆగస్టు 19న కాచరాజుపల్లి గ్రామానికి రాగ్యను రప్పించి అక్కడే మత్తు గోలీలు ఇచ్చి రాగ్య స్పృహ కోల్పోయేలా చేశారు. అనంతరం రాగ్యను చేపల వలలో చుట్టి భారీ బండరాయికి కట్టి నేరెడుగొమ్ము మండలం కాచరాజుపల్లి సమీపంలోని కృష్ణా వెనుక జలాల్లో పడవేశారు. అప్పట్లో హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహం కోసం కృష్ణా నది వెనుక జలాల్లో తీవ్రంగా గాలించినప్పటికీ మృతదేహం లభ్యం కాలేదు. తాజాగా గురువారం కృష్ణా వెనుక జలాల్లో చేపల వేటకు వెళ్లిన జాలర్లకు మృతదేహం చిక్కడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసి దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మల్చింగ్ పద్ధతితో అధిక దిగుబడులు

- కోదాడ మండల ఉద్యానవన శాఖ అధికారి అనిత

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుత వేసవిలో పంటల సాగుకు నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా ఉపయోగించి పంటలను సాగు చేసేందుకు మల్చింగ్ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడం వల్ల ఉద్యానవన పంటలకు సరిపడేంత నీటిని అందించడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. దీని నుంచి బయటపడేందుకు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించినట్లయితే అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకొని పంటలను సమర్థవంతంగా సాగుచేసుకోవచ్చని కోదాడ మండల ఉద్యానవన శాఖ అధికారి అనిత చెబుతున్నారు. మల్చింగ్ పద్ధతిలో సాగు సూచనలు ఆమె మాటల్లోనే..


మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన టమాట పంట

మల్చింగ్ అంటే..

సారవంతమైన మట్టిని పట్టి ఉంచడంతో పాటు నేలలోని తేమను ఎక్కువ కాలం ఉంచేలా మొక్క చుట్టూ పలు రకాలైన పదార్థాలను పరచి ఉంచడాన్నే మల్చింగ్ అంటారు. దీని వలన తేమ ఆవిరైపోకుండా మొక్క చుట్టూ ఎక్కువ కాలం ఉంటుంది. మల్చింగ్‌లో ప్లాస్టిక్ పట్టాలతో పాటు కాగితపు ముక్కలు, సేంద్రియ పదార్థాలు, వరి గడ్డి, వ్యవసాయ వ్యర్థాలు తదితర వాటిని ఉపయోగిస్తారు. పంట కాలంలో మల్చింగ్ చేయడం వలన తేమను పరిరక్షించడమే కాకుండా ఉష్ణోగ్రత వ్యత్యాసాల వలన నేల భౌతిక స్థితి దెబ్బతినకుండా ఉంటుంది. నేలలోని సారాన్ని కాపాడటంలో ఈ మల్చింగ్ ప్రధాన పాత్ర వహిస్తుంది. పంటలు సాగు చేయని కాలంలో సారవంతమైన మట్టిని కప్పి ఉంచుతుంది. మొక్కల మధ్య మల్చింగ్ పదార్థాలు ఉండడం వలన కలుపును బాగా నియంత్రిస్తుంది. దీని వలన పోషకాలన్నీ పంట తీసుకొనేందుకు వీలుంటుంది. నత్రజని స్థిరీకరణ జరుగుతుంది. నేలలో పోషకాల స్థాయి కూడా సహజసిద్ధంగా పెరుగుతుంది. ఈ మల్చింగ్ విధానాన్ని దీర్ఘకాలంగా చేస్తే పంటల్లో గణనీయమైన పెరుగుదలతో పాటు చీడపీడలను సమర్థవంతంగా తట్టుకొనే శక్తి పెరుగుతుంది. అంతే కాకుండా పంటల ఉత్పాదనలో కూడా మెరుగుదల కన్పిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

భౌగోళిక పరిస్థితులను, నేల స్వభావాన్ని బట్టి మల్చింగ్ చేసుకోవాలి. మల్చింగ్‌తో పాటు సూక్ష్మనీటి పద్ధతులను అవలంబిస్తే నీటి వనరులు వృథా కాకుండా ఉపయోగించుకోవచ్చు. సాగు చేసే పంటలను బట్టి మల్చింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ విస్తీర్ణంలో మల్చింగ్‌ను చేయదలిస్తే అందుబాటులో ఉండే వనరులను ఉపయోగించడం మేలు.